సాక్షి
యాదాద్రి భువనగిరి

ఆదివారం । 20 । ఆగస్టు । 2023



ఆర్జిత సేవలకు ప్రత్యేక కౌంటర్
యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆర్జిత సేవల టికెట్ బుకింగ్ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. - 10లో



చేనేత ఉత్పత్తుల పరిశీలన
హైదరాబాద్‌కు చెందిన విద్యార్థినులు కొయ్యలగూడెం, దండుమల్కాపురం గ్రామాల్లో పర్యటించారు. - 10లో



అత్తారి ఊర్లో అల్లు అర్జున్
సినీ హీరో అల్లు అర్జున్ పెద్దవూర మండలంలోని తన అత్తగారి ఊర్లో సందడి చేశారు. - 10లో

న్యూస్‌రీల్

21నుంచి అభ్యంతరాల స్వీకరణ

భువనగిరి : జిల్లా వైద్యారోగ్య శాఖలో అకౌంటెంట్ కం డీఈఓ మరియు డీఈఓ పోస్టుల ప్రొవిజినల్ మెరిట్ జాబితాకు సంబంధించి ఈనెల 21నుంచి 23వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లికార్జున్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ జాబితాను yadadri.telangana.gov.in వెబ్‌సైట్‌తో పాటు జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో నోటీస్ బోర్డులో ప్రదర్శించినట్లు పేర్కొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు


కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి పుణ్యక్షేత్రంలో శనివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువ జామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాతం సేవ చేపట్టారు. అనంతరం ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన గావించారు. ఇక ఆలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవోత్సవం నిర్వహించారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. వివిధ పూజల ద్వారా స్వామివారికి నిత్యాదాయం రూ.24,13,822 సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


డయాగ్నోస్టిక్ సెంటర్ రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ పరిపూర్ణాచారి

చౌటుప్పల్ : ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ పరిపూర్ణాచారి హెచ్చరించారు. చౌటుప్పల్‌లోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లలో శనివారం తనిఖీలు నిర్వహించారు. అనుమతి ధ్రువీకరణతో పాటు నిర్వాహకుల అర్హత సర్టిఫికెట్‌లను పరిశీలించారు. నిబంధనలకు లోబడి వ్యవహరించకపోతే సీజ్ చేస్తామన్నారు. ఆయన వెంట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ కర్నాటి వేణుగోపాల్ ఉన్నారు.

'మధ్యాహ్న' ఏజెన్సీలకు బిల్లులు విడుదల

భువనగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం అందజేస్తున్న వంట ఏజెన్సీలకు జూన్, జూలై మాసాలకు సంబంధించిన బిల్లులు విడుదలయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 679 వంట ఏజెన్సీలు ఉండగా రూ.56.53 లక్షలు విడుదలయ్యాయి. ఇందులో 9,10 తరగతులకు సంబంధించిన వంట బిల్లులు, 1 నుంచి 8 తరగతులకు సంబంధించిన కోడిగుడ్ల బిల్లులు కూడా ఉన్నాయి. త్వరలోనే ఏజెన్సీలకు బిల్లులు చెల్లిస్తామని డీఈఓ తెలిపారు.

ప్రజాదర్బార్ వినతులు ఎప్పటికప్పుడు పరిష్కారం


డ్రైవింగ్ లైసెన్సుల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ సునీత

ఆలేరురూరల్ : ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించనున్నట్లు ప్రభుత్వ విప్ గొంగిడి సునీత పేర్కొన్నారు. ఆలేరులోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా పాముకుంట, వెంకటాపురం గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన పలువురు ఆలేరు మార్కెట్ ఛైర్మన్ మొత్కుపల్లి జ్యోతి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం కొలనుపాకలో జైనమందిర్‌కు వెళ్లే దారిలో వర్షాలకు కోతకు గురైన కల్వర్టును పరిశీలించారు. అలాగే యువతకు డ్రైవింగ్ లైసెన్సుల ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. కార్యక్రమంలో పుట్ట మల్లేషం, బాలస్వామి, పత్తి వెంకటేష్, కుండె సంపత్ పాల్గొన్నారు.

సీఎం పర్యటనపై ఆసక్తి


సీఎం ప్రారంభించనున్న సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం

- ఎన్నికల నేపథ్యంలో ఏం మాట్లాడుతారోనని ఎదురుచూపులు
- దక్షిణ తెలంగాణ నుంచే ప్రచారానికి శ్రీకారం?
- సూర్యాపేట బహిరంగ సభ నాంది కాబోతుందని ప్రచారం
- పార్టీ కేడర్‌కు ఇక్కడి నుంచే దిశానిర్దేశం చేసే అవకాశం
- సిట్టింగ్‌లు, ఆశావహుల్లో టెన్షన్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : సాధారణ ఎన్నికల వేడి మొదలైంది. ఎన్నికల షెడ్యూల్‌కు సమయం దగ్గర పడింది. ఈ నేపథ్యంలో అధికార బీఆర్‌ఎస్ అన్ని పార్టీల కంటే ముందే అభ్యర్థుల జాబితాను ప్రకటించేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఆదివారం సూర్యాపేట జిల్లాలో పర్యటించబోతున్నారు. వివిధ కార్యాలయాల ప్రారంభోత్సవాల అనంతరం బహిరంగ సభలో మాట్లాడనున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సీఎం జిల్లా పర్యటనకు వస్తున్నందున ఇక్కడి నుంచే ఎన్నికల ప్రచారానికి తెర తీస్తారనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ఈసారి దక్షిణ తెలంగాణ నుంచే సీఎం తన ప్రచారాన్ని ప్రారంభిస్తారనే చర్చకు ఇది నాంది కాబోతోందని రాజకీయవర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సభ ద్వారా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడంతోపాటు ప్రతిపక్షాలపై ఎలాంటి అస్త్రాలు సంధిస్తారన్న చర్చ ప్రజల్లో సాగుతోంది. కాగా, సూర్యాపేటలో సీఎం బహిరంగ సభకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలకు మండలాల వారీగా బాధ్యతలను అప్పగించి జనసమీకరణ చేపట్టారు. ఒకరకంగా దీన్ని ఎన్నికల ప్రచార సభలాగే భావించి ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసినందున ఈ సభ ద్వారానే మళ్లీ ఎన్నికల వేడి పుట్టించేలా సీఎం ప్రసంగం ఉండబోతుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.


సభా స్థలిలో ఏర్పాట్లు

ఎమ్మెల్యేలు, ఆశావహుల్లో ఉత్కంఠ
రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థుల కసరత్తు నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన అభ్యర్థులకు సంబంధించి ఏం మాట్లాడతారోనని సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు ఆశావహుల్లోనూ టెన్షన్ నెలకొంది. పార్టీ అభ్యర్థులకు సంబంధించిన విషయాలను ప్రస్తావిస్తారా? టికెట్లకు సంబంధించిన స్పష్టత ఇస్తారా? అని ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈసారి టికెట్లను ఎవరికి ఇవ్వాలన్న విషయంలో అధినేత ఇప్పటికే ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ సభలో ఆ ప్రకటన చేస్తారా? లేదంటే ప్రతిపక్షాలను మాత్రమే టార్గెట్ చేసి, చేసిన సంక్షేమాభివృద్ధినే ప్రాధాన్యంగా తీసుకొని మాట్లాడతారా? అన్న చర్చ సాగుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సీఎం మాట్లాడుతూ.. ఇంకా చాలా అస్త్రాలు ఉన్నాయి.. ఒకొక్కటి వదులుతాం అని ప్రకటించారు. ఈ నేపథ్యంలో సీఎం ఏం మాట్లాడతారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

సిట్టింగ్‌లకే టికెట్లని చెప్పినా..
సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్లు ఇస్తామని సీఎం పలుమార్లు స్పష్టం చేశారు. అయినా సర్వేల ఆధారంగానే గెలుపునకు అవకాశాలు ఉన్న వారికే టికెట్లు కేటాయించే అవకాశం ఉంటుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అందుకే పలు నియోజకవర్గాల్లో ఆశావహులు టికెట్ తమకు ఇస్తారేమోనన్న ఆశతో ఫౌండేషన్లను ఏర్పాటు చేసుకొని కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. జిల్లాలోని నాగార్జునసాగర్, దేవరకొండ తదితర నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలపై ఆయా నియోజకవర్గాలకు చెందిన నేతలనుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నాగార్జునసాగర్‌లో నోముల భగత్‌పై ఎమ్మెల్సీ కోటిరెడ్డి వర్గం వ్యతిరేకతతో ఉంది. బుసిరెడ్డి పాండురంగారెడ్డి, మన్నెం రంజిత్ యాదవ్, కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి ఫౌండేషన్ ఏర్పాటు చేసుకొని నియోజకవర్గంలో కార్యక్రమాలు చేస్తున్నారు. శనివారం పెద్దవూరలో కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను ఆయన అల్లుడు, సినీ హీరో అల్లు అర్జున్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సాగర్ నియోజకవర్గానికే చెందిన ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి హాజరు కావడం చర్చనీయంశంగా మారింది. దేవరకొండలో రవీంద్రకుమార్‌కు టికెట్ ఇస్తే తాము పనిచేయబోమని నియోజకవర్గ నేతలు ఆలంపల్లి నర్సింహ, దేవేందర్‌నాయక్ తదితరులు శనివారం హైదరాబాద్‌కు వెళ్లి మంత్రి హరీష్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసి చెప్పారు. వీటితోపాటు కోదాడ, నకిరేకల్ వంటి నియోజకవర్గాల్లోనూ నెలకొన్న సమస్యలపై సూర్యాపేట సభ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉంటుందని నేతలు భావిస్తున్నారు.


సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులు, నాయకులతో చర్చిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

ముఖ్యమంత్రి టూర్ షెడ్యూల్ ఇలా..

- ఉదయం 11 గంటలకు సూర్యాపేటలోని ఎస్వీ డిగ్రీ కళాశాల హెలిపాడ్‌కు చేరుకుంటారు.
- 11.10కి మెడికల్ కళాశాలను ప్రారంభిస్తారు.
- 11.35కి ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను ప్రారంభిస్తారు.
- 12 గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.
- 12.30కి బీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.
- 1.15కు కలెక్టరేట్‌ను ప్రారంభిస్తారు.
- 1.45నుంచి 2.45 వరకు భోజన విరామం
- 2.45కి నూతన కలెక్టరేట్ నుంచి బయలుదేరి 3 గంటలకు ప్రగతి నివేదన సభకు హాజరవుతారు.
- 4.10కి సభాస్థలి నుంచి బయలుదేరి నేరుగా హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు.
- 4.25కు హైదరాబాద్‌కు బయలుదేరుతారు.
- సాయంత్రం వర్షం ఉంటే రోడ్డు మార్గాన ప్రగతి భవన్‌కు చేరుకుంటారు.

సూర్యాపేట ముస్తాబు


విద్యుత్ దీపాలంకరణలో మెడికల్ కళాశాల

సూర్యాపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం సూర్యాపేట పర్యటన నేపథ్యంలో అధికార యంత్రాంగ ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయం, మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని సీఎం ప్రారంభించనున్నారు.

70 ఎకరాల్లో సభా ప్రాంగణం
కొత్త వ్యవసాయ మార్కెట్ వద్ద 70 ఎకరాల స్థలంలో బహిరంగ సభ నిర్వహణకు సన్నాహాలు చేశారు. సభకు భారీ జన సమీకరణ చేయనున్నారు. జాతీయ రహదారిపై ఉదయం 11 నుంచి సాయంత్రం 5గంటల వరకు ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు.

పర్యటన ఇలా..
సూర్యాపేట పట్టణంలో 23 కిలోమీటర్ల మేర కేసీఆర్ పర్యటించేలా రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. కలెక్టరేట్, వివిధ కార్యాలయాల ప్రారంభం అనంతరం అధికారులతో సీఎం సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశమవుతారు. సీఎం పర్యటన నేపథ్యంలో మూడు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.


సూర్యాపేటలో వెలిసిన సీఎం కేసీఆర్ కటౌట్లు

గులాబీమయమైన పట్టణం
కేసీఆర్ రాక సందర్భంగా సూర్యాపేట పట్టణంలో ప్రధాన కూడళ్లలో భారీ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, సీఎం, మంత్రి జగదీశ్‌రెడ్డి కటౌట్లు ఏర్పాటు చేశారు. గులాబీ తోరణాలతో అలంకరించారు.

వ్యాపారాలు లేనప్పుడు డబ్బెక్కడిది?

- లక్షల రూపాయలు ఖర్చు ఎలా చేస్తున్నావ్
- రాజకీయ లబ్ధికోసం అనుచిత వ్యాఖ్యలు చేయొద్దు
- ఎంపీ కోమటిరెడ్డికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అనిల్‌కుమార్‌రెడ్డి హితవు


విలేకర్లతో మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : ఎంపీగారూ.. ఏ వ్యాపారాలు లేవంటున్న మీరు లక్ష రూపాయలు ఎలా ఖర్చు చేస్తున్నారు.. అంత డబ్బు ఎక్కడి నుంచి వస్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికి అనుచిత వ్యాఖ్యలు చేయొద్దని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి హితవు పలికారు. శనివారం భువనగిరిలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని తప్పుపట్టే విధంగా కాంగ్రెస్ మీటింగ్‌లో కోమటిరెడ్డి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఏ పదవిలో లేకున్నా తాను వ్యాపారం చేసి సంపాదించిన డబ్బును సేవా కార్యక్రమాల కోసం ఖర్చు చేస్తున్నానని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులను వెళ్లగొడుతామనడం సిగ్గుచేటన్నారు. తన కుటుంబ రాజకీయాల కోసం దళిత, బీసీ నేతలను తొక్కేస్తూ నీతులు వల్లిస్తున్నాడని.. ఇకనైనా వైఖరి మార్చుకోవాలన్నారు. భువనగిరిలో బీసీ నినాదాన్ని తెరపైకి తెచ్చిన ఎంపీ.. ఆ సామాజిక వర్గానికి టికెట్ ఇప్పించి మాట నిలబెట్టుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో భువనగిరినుంచి ఎంపీగా పోటీ చేయడానికి తనకు అవకాశం ఇస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా విజయం కోసం పాటుపడతానన్నారు. తాను కాంగ్రెస్ పార్టీని వీడటానికి ఇంటి పోరు కూడా ప్రధాన కారణమన్నారు.

తెలంగాణ దార్శనికుడు కేసీఆర్
తెలంగాణ దార్శనికుడు సీఎం కేసీఆర్ అని, ఆయన పాలన నచ్చినందునే బీఆర్‌ఎస్‌లో చేరానని అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. అభివృద్ధిలో హైదరాబాద్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనుడు మంత్రి కేటీఆర్ అని.. అటువంటి నాయకున్ని విమర్శించే స్థాయి ఎంపీ కోమటిరెడ్డికి లేదన్నారు. జిల్లావాసులకు మూసీ ద్వారా కాలుష్య రహిత జలాలు అందించాలని రూ.4 వేల కోట్లతో ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. తన సొంత ఊర్లో సర్పంచ్‌ను గెలిపించుకోలేనోడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి అని.. పిచ్చి మాటలు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. విలేకర్ల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ నూతి రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, నాయకులు గాదె శ్రీనివాస్, దోనకొండ వనిత, బెండె శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేయడం పౌరుల బాధ్యత



5కే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, అధికారులు

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

భువనగిరి : ఓటు వేయడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్విప్ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి నిర్వహించిన 5కే రన్‌ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు కీలకమన్నారు. అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారంతా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాని కోరారు. ఫారమ్ 6 ద్వారా కొత్త ఓటు నమోదు, ఫారమ్ 8 ద్వారా మార్పులు చేసుకోవచ్చన్నారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు కోసం నమోదు చేసుకునేలా కళాశాలల యాజమాన్యాలు చొరవచూపాలన్నారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓటర్లలో చైతన్యం తెచ్చేందుకు వారానికో కొత్త కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గతంలో తక్కువ ఓటింగ్ జరిగిన ప్రాంతాలను గుర్తించి అక్కడ ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు, విద్యావంతులు కృషి చేయాలని కోరారు. అనంతరం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల ద్వారా ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీఆర్‌ఓ పద్మాజరాణి, ఆర్డీఓ అమరేందర్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మాన్యానాయక్, జిల్లా బీసీ, ఎస్సీ సంక్షేమ, యువజన క్రీడల అభివృద్ధి ట్రెజరీ, పౌరసరఫరాల శాఖ అధికారులు యాదయ్య, శ్యాంసుందర్, ధనుంజయ్య, సురేష్, శ్రీనివాస్‌రెడ్డి, సివిల్ సప్లయ్ డీఎం గోపి కృష్ణ, భువనగిరి మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, కలెక్టరేట్ ఎన్నిల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, పర్వతారోహకురాలు పడమటి అన్వితారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు చెక్

- చౌటుప్పల్‌లో డ్రెయినేజీ వ్యవస్థ మెరుగునకు చర్యలు
- రూ.20 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- 9,10,11 వార్డుల పరిధిలో పనులకు శ్రీకారం
- పట్టణవాసుల్లో ఆనందం


శాంతినగర్ - రాంనగర్ మీదుగా నిర్మించిన ప్రధాన డ్రెయినేజీ కాల్వ


వలిగొండ లింకు రోడ్డులో జరుగుతున్న పనులు

చౌటుప్పల్ : పట్టణంలో దశాబ్దాల నాటి మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు నీరు ముందుకు కదిలేది కాదు. చిన్నపాటి వర్షం కురిసినా పరిస్థితి మరింత దయనీయంగా ఉండేది. వీధులు, ఇళ్ల మధ్యన డ్రెయినేజీ నీరు నిలిచి దుర్గంధం వెదజల్లడంతో జనం రోగాల బారిన పడుతున్నారు. ఇక నుంచి ఆ ఇబ్బందులు తొలగిపోనున్నాయి. రూ.20కోట్ల వ్యయంతో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తున్నారు.

పట్టణ సగభాగం సమస్యే
పట్టణంలోని సగ భాగం డ్రెయినేజీ సమస్య ఉంది. సరైన కాల్వలు లేకపోవడంతో మురుగు నీరు సాఫీగా వెళ్లకుండా అస్తవ్యస్తంగా ప్రవహించేది. ప్రధానంగా కొండిన్యనగర్, గణేష్‌నగర్, మల్లి కార్జున స్కూల్ ఏరియా, గాంధీపార్కు, విద్యానగర్, శాంతినగర్, రాంనగర్, వినాయకనగర్, వలిగొండ రోడ్డు, మల్లిఖార్జునగర్, బీసీకాలనీ, మణికంఠకాలనీ, మార్కండేయనగర్‌లో సమస్య అధికంగా ఉంది.

మొదలైన పనులు
డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు మున్సిపాలిటీకి ప్రభుత్వం రూ.20కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఇటీవల ప్రధాన కాల్వల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 14వ వార్డుకు సంబంధించి కొండిన్యనగర్–గణేష్‌నగర్–మల్లికార్జున స్కూల్ ఏరియా వరకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 12, 13వ వార్డులకు సంబంధించి విద్యానగర్–శాంతినగర్–రాంనగర్–వినాయకనగర్–వలిగొండ రోడ్డు వరకు పనులు నడుస్తున్నాయి. 9, 10, 11 వార్డులకు సంబంధించి మల్లికార్జునగర్–బీసీకాలనీ–మార్కండేయనగర్ – మణికంఠకాలనీ–ముత్యాల శంభారెడ్డి వ్యవసాయక్షేత్రం–వలిగొండ రోడ్డు వరకు నిర్మించే కాల్వ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే కొలతలు వేశారు.

ఇబ్బందులు తీరనున్నాయి



మల్లికార్జున దేవాలయం నుంచి దిగువకు వరద, మురుగు నీరు సాఫీగా వెళ్లేంది కాదు. ఈ సమస్యతో చాలా ఏళ్లుగా అవస్థలు పడుతున్నాం. ఇక్కడి నుంచి వలిగొండ రోడ్డు వరకు ప్రధాన కాల్వ నిర్మాణం చేపట్టడం శుభపరిణామం. చాలా కాలనీల సమస్యలు పరిష్కారమవుతాయి. ప్రజల ఇబ్బందులు తొలగి పోనున్నాయి.
– దండ అరుణ్‌కుమార్, స్థానికుడు

ఎమ్మెల్యే సహకారంతోనే సాధ్యమైంది



ప్రధాన డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు నీరు అస్తవ్యస్తంగా ప్రవహించేది. భారీ వర్షాలు కురిసిన సమయాల్లోనూ వరద నీరు దిగువకు సాఫీగా వెళ్లలేక కాలనీల్లో నిలిచిపోయేది. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి స్వయంగా పర్యటించి ప్రజల ఇబ్బందులను గుర్తించారు. మూడు ప్రాంతాల్లో పనులను ప్రారంభించారు.
– బొడిగె అరుణబాలకృష్ణ, 9వ వార్డు కౌన్సిలర్

భవిష్యత్‌లో ఇబ్బందులుండవు



చౌటుప్పల్‌లో చాలా ఏళ్లుగా డ్రెయినేజీ సమస్య ఉంది. ముఖ్యంగా డ్రెయినేజీ నీరు వెళ్లడానికి ప్రధాన కాల్వలు లేవు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంగా ఇటీవల అనేక రకాలుగా కసరత్తు చేశాను. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కాల్వల నిర్మాణాలు చేపట్టాం. ఏమాత్రం నిధుల కొరత లేకుండా పనులను పూర్తి చేయిస్తా. నిరంతరం వార్డుల్లో పర్యటిస్తూ పనులను పర్యవేక్షణ చేస్తున్నాను. ప్రజలు అభివృద్ధిని సద్వినియోగం చేసుకొని అండగా ఉండాలి.
– కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే

పిల్లల విషయంలో నిర్లక్ష్యం తగదు

భూదాన్‌పోచంపల్లి : పిల్లల విషయంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఈఓ నారాయణరెడ్డి సూచించారు. శనివారం భూదాన్‌పోచంపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుటుంబ గొడవలు పిల్లల చదువుపై తీవ్ర ప్రభావం చూపుతాయని, ఇంటి వద్ద చదువుకునేందుకు ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి తొలి మెట్టు అమలుపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, విజయలక్ష్మి, ఎస్‌ఎంసీ చైర్మన్ చందన, వైస్ చైర్మన్ పాల్గొన్నారు.

B.Sc (Nursing) అడ్మిషన్లకై సంప్రదించండి
నల్లగొండ / Hyderabad నందు B.Sc. Nursing కోర్సులో చేరదలచిన వారు సంప్రదించండి.
SRI BHAVANA COLLEGE OF NURSING
Nalgonda Town. Cell: 98481 05500 / 96529 09766



క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం


పులి పరమేశ్ (ఫైల్)

గరిడేపల్లి : రోడ్డు ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ దుర్మరణం చెందాడు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కల్వకుర్తి నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్తున్న లారీ మార్గమధ్యలో గరిడేపల్లి మండలం రాయినిగూడెం వద్దకు రాగానే మరమ్మతుకు గురైంది. దీంతో డ్రైవర్ వాహనాన్ని అక్కడే నిలిపివేశాడు. ఈ క్రమంలో షాద్‌నగర్ నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్తున్న లారీ ఎలాంటి సిగ్నల్ లేకుండా చీకటిలో నిలిచున్న లారీని వెనుకనుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ఢీకొట్టిన లారీ డ్రైవర్ రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలం కలకొండ గ్రామానికి చెందిన పులి పరమేష్(35) క్యాబిన్‌లో ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు పులి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

బెస్ట్ న్యూస్ పిక్చర్ కేటగిరీలో 'సాక్షి' ఫొటోగ్రాఫర్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న శివకుమార్

భువనగిరి : ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కొల్లోజు శివకుమార్ తీసిన చిత్రం బెస్ట్ న్యూస్ పిక్చర్ కేటగిరీలో ఎంపికైంది. ఈ సందర్భంగా శనివారం విజయవాడలో జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వెస్ట్ జోన్ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు చేతుల మీదుగా శివకుమార్ అవార్డు అందుకున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


ప్రమాదానికిగురైన కారు

కొండమల్లేపల్లి : అదుపు తప్పి కారు డీసీఎంను ఢీకొట్టింది. ఈ ఘటన శనివారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులోని వాసవీ మాత ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఓ శుభకార్యంలో కొందరు పాల్గొని కారులో తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలోనే ముందు ఉన్న డీసీఎంను ఢీకొట్టారు.ప్రమాద సమయంలో కారులోని ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో ఎవ్వరికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సేవాతత్పరుడు.. పాండురంగారెడ్డి

వృత్తి బిల్డర్.. ప్రవృత్తి సేవ

- బుసిరెడ్డి ఫౌండేషన్ ద్వారా సాగర్ నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు
- సాయం అందించేందుకు టోల్ ఫ్రీ నంబర్ల ఏర్పాటు
- ఆదర్శంగా నిలుస్తున్న ఫౌండేషన్ సేవలు


కూలీలకు ఉచితంగా లంచ్ బ్యాగులు పంపిణీ చేస్తున్న పాండురంగారెడ్డి (ఫైల్)

హాలియా : నిరుపేద కుటుంబాలు, ఆర్థిక స్థోమతలేని నిస్సాహాయులకు సాయం చేస్తూ వారి జీవితాల్లో వెలుగు నింపుతున్నారు..బుసిరెడ్డి పాండురంగారెడ్డి. పుట్టిన గడ్డకు సేవ చేయాలనే సంకల్పంతో ఇంటి పేరుతోనే బుసిరెడ్డి ఫౌండేషన్‌ను స్థాపించి మన సాగర్..మెరుగైన సాగర్ అనే నినాదంతో నియోజకవర్గంలో కొంత కాలంగా విస్తృత స్థాయి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

కష్టాల కడలి నుంచి బిల్డర్‌గా..

నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి(సాగర్) మండలం కొంపెల్లి గ్రామానికి చెందిన బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, పూలమ్మ దంపతుల చిన్న కుమారుడు బుసిరెడ్డి పాండురంగారెడ్డి. డిగ్రీ వరకు చదువుకున్న ఈయన స్వగ్రామంలో కొంత కాలం పాటు వ్యవసాయం చేశాడు. ఆ తరువాత ఏదైన ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో 25 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడే కొంత కాలంపాటు లారీ ట్రాన్స్‌పోర్టు బిజినెస్ చేసి దాంట్లో నష్టం రావడంతో బిల్డింగ్‌ల నిర్మాణంపై దృష్టి సారించాడు. క్రమక్రమంగా చిన్నచిన్న భవనాలను నిర్మించిన ఆయన పాతికేళ్ల ప్రస్థానంలో భారీ భవనాల నిర్మాణాల స్థాయికి ఎదిగి వైష్ణవి ఇన్‌ఫ్రా ఇండియా లిమిటెడ్ సంస్థకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నాడు.

మన సాగర్.. మెరుగైన సాగర్ అనే నినాదంతో ..

బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి మన సాగర్..మెరుగైన సాగర్ అనే నినాదంతో నియోజకవర్గ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బుసిరెడ్డి ఫౌండేషన్ పేరుతో ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి గ్రామాల్లో నిరుపేద, నిస్సహాయులను గుర్తించి వారికి ఆర్థిక సాయం అందిస్తున్నారు.

బుసిరెడ్డి ఫౌండేషన్ ద్వారా చేపట్టిన కార్యక్రమాలు ఇవే..

- సాగర్ నియోజకవర్గ వ్యాప్తంగా 25 దేవాలయాల అభివృద్ధికి రూ. 50వేల నుంచి రూ.లక్ష వరకు విరాళంగా అందించారు.
- రైతులకు ఉచితంగా జింక్ బ్యాగుల పంపిణీ చేయడంతో పాటు డ్రోన్ ద్వారా రైతుల పొలాల్లో ఉచితంగా పురుగుల మందు పిచికారీ సదుపాయం కల్పించారు.
- మృతిచెందిన నిరుపేద కుటుంబాల వారు ఫోన్ చేసిన వెంటనే వారి బంధువులకు భోజనాలు ఏర్పాటు చేయడం. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 500 కుటుంబాలకు అన్నదానం చేశారు.
- బుసిరెడ్డి చేయూత ద్వారా గిరిజనులు, అనాథలు, దివ్యాంగులు, వితంతవులు, నిరుపేదలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున సుమారు 385 మందికి ఆర్థికసాయం చేశారు.
- ఈదురుగాలులకు ఇల్లు కూలిన బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ఆర్థికసాయం చేశారు.
- నియోజకవర్గ వ్యాప్తంగా గత వేసవిలో లక్ష లీటర్ల మజ్జిగ, రాగి జావ పంపిణీ చేశారు.
- 250 మంది వీధి వ్యాపారులకు ఉచితంగా గొడుగులు, 3వేలమంది రైతు కూలీలకు లంచ్ బ్యాగులు, 8వేల మంది విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, ప్రతి ఇంటికి పండ్ల మొక్కలు, జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు. ఇలా పేదలు 1800 మందికి ఆర్థిక సాయం అందించారు.
- మీకు ఏ సమస్య ఉన్నా ఫోన్ చేయండి మా ట్రోల్ ఫ్రీ ఫోన్ నంబర్లు 9346534535, 9110362628, 8297770171ను సంప్రదిస్తే సేవా కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామంటూ తన ఫౌండేషన్ ద్వారా ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు.


విద్యార్థులతో కరచాలనం చేస్తున్న పాండురంగా రెడ్డి (ఫైల్)


దివ్యాంగులకు ఆర్థికసాయం అందిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి (ఫైల్)


డ్రోన్‌తో రైతుల పొలాల్లో పురుగుల మందు పిచికారీ చేయిస్తున్న పాండురంగారెడ్డి (ఫైల్)

ప్రజా సేవే లక్ష్యంగా..



సాగర్ నియోజకవర్గంలో బుసిరెడ్డి ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించా. రైతులు, విద్య, వైద్యం, నిరుపేదలు, ఏ ఆధారం లేని అభాగ్యులకు అండగా నిలిచి ఆర్థిక సహకారం అందించా. ఫౌండేషన్ ద్వారా నియో జకవర్గంలో తాను చేపట్టే సేవా కార్యక్రమాలతో అన్నీ వర్గాల ప్రజలు దగ్గరయ్యారు. నా సేవలను గుర్తించి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇస్తే నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు నన్ను ఆదరిస్తారనే నమ్మకం ఉంది. దీంతో ప్రజలకు మరింత సేవ చేసే అదృష్టం లభిస్తుంది.
– బుసిరెడ్డి పాండురంగారెడ్డి, ఫౌండేషన్ చైర్మన్


ఫౌండేషన్ సభ్యులతో చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి (ఫైల్)


వృద్ధుడికి ఆర్థిసాయం అందజేస్తున్న పాండురంగారెడ్డి (ఫైల్)

దారి దోపిడీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

- మూడు ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్ స్వాధీనం
- ఇద్దరు నిందితులపై పదుల సంఖ్యలో కేసులు


పట్టుబడిన వాహనాలను పరిశీలిస్తున్న ఏసీపీ మొగిలయ్య, సీఐ దేవేందర్

చౌటుప్పల్ : ద్విచక్రవాహనాలను ఎత్తుకెళ్లడంతో పాటు దారి దోపిడీలకు పాల్పడే ఇద్దరు ముఠా సభ్యులను చౌటుప్పల్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద మూడు బైక్‌లు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను శనివారం చౌటుప్పల్ సీఐ దేవేందర్‌తో కలిసి ఏసీపీ మొగిలయ్య వెల్లడించారు. హైదరాబాద్ నగరం సరూర్‌నగర్‌లోని శివం నగర్‌లో నివసించే రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆంబోతుతండాకు చెందిన ఆంగోతు రమేష్‌నాయక్ టీస్టాల్ నడుపుతుంటాడు. కర్మన్‌ఘట్‌లోని హనుమాన్ టెంపుల్ సమీపంలో నివాసం ఉండే ఆంబోతు తండాకే చెందిన ఆంగోతు కృష్ణ నాయక్ కూలీగా పని చేస్తాడు. వీరిద్దరు మద్యం, గంజాయి సేవించడం వంటి చెడు వ్యసనాలకు బానిసలయ్యారు.

తక్కువ సమయంలో డబ్బు సంపాదించాలని..

తాము చేసే పనుల ద్వారా వచ్చే ఆదాయం ఏమాత్రం సరిపోకపోవడంతో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించేందుకుగాను వీరిద్దరూ దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు.ఈ క్రమంలో వివిధ ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను ఎత్తుకెళ్లడం ప్రారంభించారు. అదే సమయంలో దొంగలించిన బైక్‌లపై వెళ్లి దారి దోపిడీలకు సైతం పాల్పడుతున్నారు. పలు కేసుల్లో పోలీసులకు పట్టుబడి జైలుకు సైతం వెళ్లివచ్చారు. అయినప్పటికీ తీరు మార్చుకోలేదు.

పోలీసులకు చిక్కారు ఇలా..

చౌటుప్పల్‌లోనే దొంగలించిన బైక్‌పై ఇద్దరు కలిసి ఈ నెల 17న తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి చౌటుప్పల్‌లోని మార్కెట్ యార్డు వద్దకు చేరుకున్నారు. అక్కడే రోడ్డు పక్కన ఆగిఉన్న లారీ వద్దకు వెళ్లారు. కేబిన్‌లో నిద్రిస్తున్న డ్రైవర్ జేబులో ఉన్న సెల్‌ఫోన్ లాక్కున్నారు. నగదు ఏమైనా ఉందేమోనని డ్యాష్‌బోర్డులో వెతుకుతుండగా లారీ డ్రైవర్ అడ్డుకున్నాడు. దీంతో ఇద్దరు నిందితులు లారీ డ్రైవర్‌ను చంపుతామని బెదిరించారు. పెనుగులాట జరుగుతున్న క్రమంలో అక్కడి నుంచి తప్పించుకొని అదే బైకుపై హైదరాబాద్‌కు వెళ్లారు. తాము దొంగిలించిన ద్విచక్రవాహనాలను విక్రయించే ఏర్పాట్లు చేసుకున్నారు. ఇప్పటికే రహస్యంగా దాచి ఉంచిన దొంగిలించిన వాహనాలను తీసుకెళ్లేందుకు శనివారం ఇద్దరు కలిసి బైకుపై చౌటుప్పల్‌కు వస్తున్నారు. ఆ క్రమంలో దండుమల్కాపురం గ్రామం వద్ద వాహనాల తనిఖీలు చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. అదుపులోకి తీసుకొని విచారించగా దాచి ఉంచిన బైకుల జాడచెప్పారు. తమ నేరాల చిట్టాను ఒప్పుకున్నారు.

నిందితులపై పలు స్టేషన్లలో కేసులు

దొంగతనాలు, దారి దోపిడీలకు సంబంధించి 2016 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఏ–1 నిందితుడిగా ఉన్న రమేష్‌నాయక్‌పై చౌటుప్పల్, ఎల్బీనగర్, వనస్థలిపురం, ఉప్పల్ ప్రాంతాల్లో 17కేసులు నమోదయ్యాయి. ఏ–2గా ఉన్న కృష్ణనాయక్‌పై చౌటుప్పల్, ఎల్బీనగర్, వనస్థలిపురం, సికింద్రాబాద్ ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 14 కేసులు ఉన్నాయి. పట్టుబడిన నిందితులను రిమాండ్ నిమిత్తం స్థానిక కోర్టులో హాజరుపర్చి అక్కడి నుంచి జైలుకు తరలించారు. చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన సీఐ దేవేందర్‌ను ఏసీపీ అభినందించారు.

డివైడర్‌ను ఢీకొట్టి.. కారు పల్టీ

- యజమాని మృతి, డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ఇబ్రహీంపట్నం రూరల్: అతివేగంగా వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో యజమాని మృతి చెందగా, డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ రఘువీర్‌రెడ్డి కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా, చింతలపాలెం మండలం మల్‌రెడ్డిగూడ గ్రామానికి చెందిన ఉప్పతల నర్సింహారావు రియల్ ఎస్టేట్ వ్యాపారి. శుక్రవారం రాత్రి తన కారులో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా.. ఎగ్జిట్ నంబర్ 12 వద్దకు రాగానే కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నర్సింహారావుకు రక్తస్రావం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. డ్రైవర్ చింతల నారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ ప్రూఫ్‌తో సీఎం సభా వేదిక


వాటర్ ప్రూఫ్‌తో ఏర్పాటు చేసిన సభావేదిక

సూర్యాపేట : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించనున్న సీఎం కేసీఆర్ సభా వేదికను వర్ష సూచన కారణంగా వాటర్ ప్రూఫ్‌తో సిద్ధం చేశారు. కానీ, సభా ప్రాంగణం మాత్రం ఓపెన్‌గా ఉండడంతో వర్షం వస్తే జనం పరిస్థితి ఏమిటన్న ఆందోళన పార్టీ శ్రేణుల్లో నెలకొంది. ఇదిలా ఉంటే సభకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సభా స్థలంలో 108 అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచనున్నారు.

కోతుల దాడిలో వ్యక్తికి గాయాలు

నూతనకల్: కోతుల దాడిలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన నూతనకల్ మండలం ఎర్రపహాడ్ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రపహాడ్‌కు చెందిన ధర్మారపు అంజయ్య శనివారం సాయంత్రం గ్రామంలో మరొకరి ఇంటికి వెళ్తుండగా కోతుల గుంపు అకస్మాత్తుగా వచ్చి దాడి చేశాయి. దీంతో ఆయన వీపుపై గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కోతుల గుంపును చెదరగొట్టారు. అతడిని ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కోతుల బెడద నివారించాలని ప్రజలు అధికారులను కోరారు.

తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర చిరస్మరణీయం


మాట్లాడుతున్న నాగభూషణ్

భువనగిరి: తెలంగాణ మలిదశ ఉద్యమంలో గద్దర్ పాత్ర చిరస్మరణీయమని ప్రజాఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ ఆర్.నాగభూషణ్ అన్నారు. గద్దర్ సంతాప సభను శనివారం భువనగిరిలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీడిత ప్రజల కోసం, దోపిడీ పాలనకు వ్యతిరేకంగా గద్దర్ తన ఆటాపాటలతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని కొనియాడారు. లౌకికవాదం, ప్రజాస్వామ్య హక్కుల సాధన కోసం ఎనలేని పోరాటాలు చేశారని పేర్కొన్నారు. గద్దర్ మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటన్నారు. అంతకుముందు గద్దర్, జహీర్ అలీఖాన్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజాఫ్రంట్ జిల్లా సలహాదారుడు బట్టు రాంచంద్రయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఎస్.మల్లారెడ్డి, సీపీఎం ఎల్ రాష్ట్ర నాయకుడు కెవిడి ఉప్పలయ్య, ప్రజాఫ్రంట్ జిల్లా కన్వీనర్ కాశపాక మహేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, సామాజిక కార్యకర్త శీలం స్వామి, నాయకులు బాల నర్సింహ, తంగళ్లపల్లి రవికుమార్, శ్రీనివాసచారి, యాదయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలి

- మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి
- ఎన్ఎస్పీ ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా


ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

మిర్యాలగూడ : నాగార్జున సాగర్ ఎడమకాల్వకు సాగునీటిని అందించి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక ఎన్ఎస్పీ ఈఈ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర్ ఆయకట్టులో సాగునీరు అందక పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయని, బోర్లుబావుల కింద సైతం పంటలు వేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో 518 అడుగుల నీటిమట్టం ఉందని.. గతంలో 510 అడుగులు ఉంటేనే సాగు నీటిని విడుదల చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం స్పందించి సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. అనంతరం ఈఈ కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు ముడావత్ రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, పోలెబోయిన వరలక్ష్మి, వినోద్, పగిడోజు రామ్మూర్తి, చౌగాని వెంకన్న, పాపానాయక్, సైదా నాయక్, కోడిరెక్క మల్లయ్య, భిక్షం పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

పారామెడికల్ అడ్మిషన్లు ఇంటర్మీడియట్‌లో ఏదైన గ్రూప్‌లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థినీ / విద్యార్థులు అర్హులు. Courses: DMLT / DRGA / DMIT / DMPHA (M) Anasthesia ఆప్తాలమిక్ / డయాలసిస్ త్రివేణి పారామెడికల్ కళాశాల, నల్లగొండ. సంప్ర॥ సెల్ : 9652909766 / 9848105500 [YA-2710]

DIRECT FINAL YEAR

Direct Final Year: Discontinued (or) Fail Degree; P.G., LL.B, B.Tech, M.Tech, B.Sc, M.Sc అగ్రి, నర్సింగ్ BPT, MPT, P.hd. Cell: 9951627995, 8885404396 [W-785649]

Real Estate

VILLA FOR SALE

Best Gated Community in Miryalaguda District Super Villas Reasonably Priced. Must See! Fully Ready Call: 9440467666. [H-788565]

HOUSE FOR SLAE

నల్గొండ పట్టణం MLG రోడ్డు అల్కాపురి కాలనీలో సౌత్ ఫేస్ న్యూ కన్‌స్ట్రక్షన్ అన్ని వసతులుగల ఇల్లు అమ్మబడును. బ్యాంకు లోన్ సౌకర్యం కలదు. ఫోన్.7396781479, 9440184054. [H-189566]

PLOT FOR SALE

శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్, నల్లగొండ ప్లాట్ నెం.29 107 గజాలు, 20 ఫీట్ల రోడ్డు ఈస్ట్ ఫేస్ 21.5" పొడవు 45 ఫీట్ల గల ప్లాట్ గజం 15 వేలకు అమ్మబడును. ఆసక్తి గలవారు సంప్ర॥సెల్ : 9490528836 [Y-1124102]

మిర్యాలగూడ పట్టణం ఈదులగూడెం చౌరస్తా అగ్రిగోల్డ్ ఇల్లుల మధ్యలో గల 150 చ॥గ॥ గల 2 ప్లాట్లు అమ్మబడును. సంప్ర॥ సెల్: 9701113125 [Y-798255]

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బెంగుళూరు హైవే తిమ్మాపూర్, కొత్తూరు, నందిగామ ఇళ్ళమధ్యలో HMDA వెంచర్‌లో కే॥ 15 లక్షలకే ప్లాట్ సొంతం లోన్ సౌకర్యం కలదు.(ఏజెంట్లు కావలెను) 9052254789. [HA-788519]

Services

BUSINESS OFFER

స్త్రీ/పురుషులు, చిన్న పెట్టుబడితో ప్రతినెల 25000/- ఫిక్స్‌డ్ వేతనంతో పాటు మీకు సరిపడ ఆదాయం పొందండి. ఫోన్ : 7386425653, 7416087357 [H-189383]

Wanted

Wanted Teachers For all Subjects Vishishta School Nalgonda Contact Cell : 8885402344 [YA-14968]

ప్రముఖ బ్యాంకులలో కం॥ఆపరేటర్స్ /క్లర్క్ / అటెండర్స్ / ఆఫీస్ అసిస్టెంట్స్ / అకౌంటెంట్స్/ క్యాషియర్స్. Q: 10th-PG, ఆకర్షణీయమైన జీతం. 9492881006 [G-7531]

పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-788737]

గ్రాడ్యుయేషన్ చదువుకున్న లైసిన్ ఆఫీసర్స్ మరియు కన్‌స్ట్రక్షన్, వ్యవసాయం లో అనుభవం ఉన్న సీనియర్ సూపర్ వైజర్ కావలెను. PVC ప్రాజెక్ట్స్, Call Mon-Sat 11am-5pm on 040-23338080, 8686417794 [H-781265]

Now Hiring Sales Staff, SRI Mahalaxmi Jewellers & Pearls, Jubilee Hills, Hyderabad. Join our Prestigious group for growth. Male Candidates only. Execullent pay. Ph: 9000703311, 9100112221, 9441436385. [HA-11739]

సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. :220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
9010178203
9912220740 9010038110
9010046033
భువనగిరి : 9010073592

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు


డాక్టర్ శ్రీనివాసరావు


బాబుసాయి పేటలో బోరు నీటి ద్వారా సాగు చేసిన వరి చేను

పాడి పంట

త్రిపురారం : జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా ప్రధాన పంటలైన వరి, పత్తి, కంది, కూరగాయల సాగుకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ఇలాంటి అనూహ్య పరిస్థితుల్లో రైతులు సరైన సస్యరక్షణ, పోషకాల యాజమాన్యంతో పాటు మెలకువలు పాటిస్తే నష్టాన్ని నివారించుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డి నేటర్ డాక్టర్ శ్రీనివాసరావు సూచిస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు ఇలా..

వరి : వర్షాలు తగ్గిన వెంటనే సాధ్యమైనంత త్వరగా అధికంగా ఉన్న మురుగు నీటిని బయటికి తీసివేసి మొక్కలు త్వరగా కోలుకోవడానికి ఎకరాకు 40 కిలోల యూరియా వేసుకోవాలి. పంట 45 రోజుల కంటే తక్కువగా ఉంటే ఎకరాకు 0.2 శాతం జింక్ సల్ఫేట్(2 గ్రాముల జింక్ సల్ఫేట్ ఒక్క లీటర్ నీటిలో) కలిపి పిచికారీ చేసుకోవాలి. వర్షాల అనంతరం నెలకొనే వాతావరణ పరిస్థితుల కారణంగా వరిలో కాండం తొలుచు పురుగు, గొట్టపు పురుగుల ఉధృతి పెరిగి పంటకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉన్న కారణంగా ఎప్పటికప్పుడు పంటను పరిశీలిస్తూ అవసరమగు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి.

కంది : సాధ్యమైనంత త్వరగా మురుగు నీటినీ తీసేసి వర్షాలు తగ్గగానే మొక్కలకు పోషకాల మద్దతు కోసం 1శాతం పోటాషియం నైట్రేట్(20 గ్రాముల పోటాషియం నైట్రేట్‌ను 1 లీటరు నీటిలో కలిపి) లేదా 1 శాతం కరిగే ఎరువై 19:19:19 ను నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వర్షాల అనంతరం నేలలోని అధిక తేమ వల్ల కంది పంటలో వేరుకుళ్లు ఉధృతి అధికమయ్యే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు పంటను పరిశీలిస్తూ తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

కూరగాయలు : వర్షాలు తగ్గగానే అదనపు నీటిని యయటకు తీసివేసి మొక్కలకు పోషకాల మద్దతుగా 2 శాతం యూరియా(20 గ్రాముల యూరియాను 1 లీటరు నీటిలో కలిపి) రెండు నుంచి మూడు సార్లు పిచికారీ చేయాలి. కూరగాయల మొక్కలు త్వరగా కోలుకోవడానికి ప్రతి ఎకరాకి 10 కేజీల మ్యూరేట్ ఆఫ్ పోటాష్(ఎమ్ఓపీ), 30 కిలోల యూరియాను వేసుకోవాలి. సాధారణ తెగుళ్ల, పురుగులు ముఖ్యంగా టమాటాలో తెల్లదోమ, బ్యాక్టీరియా, ఆకుమచ్చ తెగులు ఉధృతి నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి.

ఉద్యానవన పంటలు : వర్షాలు, గాలి దుమారం వల్ల నేలపై పడిన చెట్లను ఎత్తి మొదళ్ల వద్ద మట్టితో బలంగా చేర్చి చెట్లను నిలబెట్టుకోవాలి.సకాలంలో ఎరువులు వేయడంతో పాటు మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలి. విరిగిపోయిన, పాడైపోయిన కొమ్మలపైన బోరాక్స్ పేస్ట్ కలిపి అప్లై చేయాలి.

పత్తి : వర్షాలు తగ్గిన వెంటనే పత్తి పంటలో నిలిచిన మురుగు నీటిని త్వరగా బయటకు తీసేసి మొక్కలకు పోషకాల మద్దతు ఇవ్వడానికి 1 శాతం పొటాషియం నైట్రేట్‌ను(30 గ్రాముల పోటాషియం నైట్రేట్‌ను 1 లీటరు నీటిలో) కలిపి లేదా 1 శాతం కరిగే ఎరువైన 19:19:19 ను నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పత్తిలో సూక్ష్మ పోషకాల నివారణకు సార్ములా–4ను 5 గ్రాములు 1 లీటరు నీటిలో కలిపి 1–10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి. వర్షాల అనంతరం పత్తిలో పచ్చదోమ వేరు కుళ్లు, ఆకు మచ్చ తెగులు వచ్చే అవకాశం ఉన్నందున పంటను జాగ్రత్తగా పరిశీలిస్తూ సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.